సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 12 । జనవరి । 2024



సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి పెట్టాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని వ్యాధి నిర్ధారణ కేంద్రాలను పరిశీలించారు. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కారుతోపాటు రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 109 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	425	487
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2093.380 కిలోలు

న్యూస్‌రీల్

నూతన నియామకం



కె. వాణి

కురబలకోట: మానవ హక్కుల ప్రొటెక్షన్ అన్నమయ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మండలంలోని అంగళ్లుకు చెందిన కె. వాణిని నియమిస్తూ జాతీయ చైర్మన్ (హెచ్ఆర్‌పీ) అల్లాడి వెంకటేశ్వర్‌రావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ మనిషి పుట్టినప్పటి నుంచి మానవ హక్కులు సంక్రమిస్తాయన్నారు.వీటి పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. దీనిపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ప్రధానమంత్రి 15 పాయింట్ల కమిటీకి ఎంపిక



ఎస్.ఫిర్దోస్‌ఖాన్

మదనపల్లె: మైనారిటీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమం జిల్లాస్థాయి కమిటీలో ముస్లిం కమ్యూనిటీ తరపున ప్రతినిధిగా పట్టణానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మనపల్లె ఫిర్దోస్‌ఖాన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గిరీషా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కమిటీ మూడునెలలకు ఒకసారి సమావేశమై ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం, అభివృద్ధిపై చర్చిస్తారన్నారు. ఈ సందర్భంగా కమిటీలో తనకు అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి ఫిర్దోస్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



కదిరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సందీప్

గాలివీడు: మండల కేంద్రంలోని గాలివీడు-2 సచివాలయం పరిధిలోని వృద్ధురాలు వండాడి కదిరమ్మ కాలు విరిగి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ అరవదాసరి సందీప్‌కుమార్ గురువారం తిరుపతికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశాడు. దీంతో ఆమె వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక ఏర్పాట్లు



వీసీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా పరిధిలో శాంతి భద్రతల అంశంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలియజేశారు. గురువారం 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో తీసుకుంటున్న చర్యల గురించి ఎస్పీ వివరించారు. రాష్ట్ర అధికారులు సూచనలను కూడా పరిగణలోకి తీసుకొని జిలాలో ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ ఓటుహక్కును వినియోగించుకునేలా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.

రేపటి నుంచి రేణిగుంట వరకు 'డెమో'

కడప కోటిరెడ్డి సర్కిల్: నంద్యాల-కడప-నంద్యాల మధ్య నడుస్తున్న డెమో రైలు (07284/85)ను ఈనెల 13వ తేదీ నుంచి రేణిగుంట వరకు పొడిగించారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. నంద్యాలలో ఈ రైలు ఉదయం 5.40 గంటలకు బయలుదేరి కడపకు 8.45 గంటలకు వచ్చి, మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంటకు చేరుతుందన్నారు. తిరిగి రేణిగుంటలో 1.45 గంటలకు బయలుదేరి కడపకు సాయంత్రం 5.00 గంటలకు చేరుకుని నంద్యాలకు రాత్రి 9.00 గంటలకు వెళుతుందన్నారు. ఈ రైలు నంద్యాల, మద్దూరు, బనగానపల్లె, కోయిలకుంట్ల, సంజామల, నొస్సం, ఉప్పలపాడు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వే కోడూరు, బాలుపల్లె స్టేషన్లలో ఆగుతుందన్నారు.

దయచేసి.. వేచి ఉండండి

ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలంటే సురక్షిత, సుఖవంతమైన ప్రయాణాన్ని కోరుకుంటారు. ఇందుకోసం అధికశాతం మంది అన్ని సౌకర్యాలతో తక్కువ చార్జీతో సాగే రైలు ప్రయాణాన్ని కోరుకుంటారు. ముందుగానే తమ టిక్కెట్లను రిజర్వు చేసుకుంటారు. అలాంటిది దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగకు సొంతూర్లకు రావడానికి రైల్వేస్టేషన్‌కు వెళితే ఉన్న రైళ్లలో పెద్ద ఎత్తున వెయిటింగ్ లిస్టు...కొత్త రైళ్ల ఊసే లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు, అధిక మొత్తం చెల్లించి విమాన యానం వైపు దృష్టి సారిస్తున్నారు.



కడప స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులతో రైళ్లు కిటకిట
- చాంతాడంతా వెయిటింగ్ లిస్ట్
- గతేడాది ప్రత్యేక రైళ్లను నడిపిన అధికారులు
- ఈమారు ఆ ఊసే లేని వైనం

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూర్లకు రావాలనుకునే ప్రయాణికులకు ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రిజర్వేషన్లు చేయించుకుందామంటే దాదాపు ఒకటిన్నర నెల నుంచి వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది. మూడు నెలల కిందట రిజర్వేషన్ చేయించుకున్న వారికి మాత్రమే బెర్త్ కన్ఫర్మ్ అయింది. అయితే చాలామంది తత్కాల్ టిక్కెట్లకు ఎదురుచూస్తున్నారు.

- కడప మీదుగా రోజువారీగా 26 రైళు, వారాంతాపు 32 రైళ్లు నడుస్తున్నాయి.సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీటిల్లో ముందే రిజర్వేషన్లు అయిపోయాయి. వైఎస్సార్ జిల్లాకు చెందిన చాలామంది విశాఖపట్టణం, హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, పూనె తదితర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డారు. సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో బంధువులు, మిత్రులతో సరదాగా గడిపడానికి వస్తుంటారు. అయితే రైళ్లలో రిజర్వేషన్లు లభించకపోవడంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సంక్రాంతి పండుగకు గతేడాది ప్రత్యేక రైళ్లు నడిపిన దక్షిణమధ్య రైల్వే ఈ ఏడాది మొండిచేయి చూపింది. వీటిని నడిపితే రైల్వేకు ఆదాయం పెరగడంతోపాటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉభయ వైఎస్సార్ జిల్లా మీదుగా కడప, ఎర్రగుంట్ల, కమలాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, జమ్మలమడుగు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు దృష్టి సారించి ఈ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడపాలని కోరుతున్నారు. కడప మీదుగా చెన్నై, ముంబై, ఢిల్లీ, విశాఖపట్టణం, మధురై, కరైకల్, షిర్డి తదితరప్రాంతాలకు రైళ్లు నడుస్తున్నాయి.

100 నుంచి 150 వరకు వెయిటింగ్ లిస్ట్

పలు రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత ఉంది. ఏ రైలు తీసుకున్నా 100 నుంచి 150, 150-200 వరకు వెయిటింగ్ లిస్టు ఉండడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

రైలు చార్జీల వివరాలు (రూ.లలో)

నుంచి-వరకు	జనరల్	స్లీపర్	త్రీ-టైర్	టు-టైర్	వన్‌టైర్
కడప-కాచిగూడ	180	340	880	1235	2050
కడప-ముంబయి	295	520	1365	1940	--
కడప-చెన్నై	115	220	555	760	--
కడప-విశాఖ	250	445	1195	1710	2880
కడప-ఢిల్లీ	485	820	8130	3080	5260
కడప-మధురై	210	380	1030	1470	2445
కడప-కరైకల్	195	355	960	1365	2285
కడప-షిర్డీ	235	565	1510	2180	3695



ప్రత్యేక రైళ్లు నడపాలి



సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉండడంతో రైళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే రైళ్లలో రద్దీ కారణంగా జనరల్‌లో కింద కూర్చొని వెళ్లాల్సి వస్తోంది. ప్రతి పండుగకు అదనపురైళ్లు నడుపుతుండేవారు. ప్రస్తుతం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు స్పందించి పండుగకు ప్రత్యేక రైళ్లు నడపాలి.

– ఉమాపతి, ప్రయాణికుడు,కడప

ఇబ్బందులు లేకుండా చూడాలి



ప్రస్తుత పరిస్థితుల్లో రైలు ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. మూడు నెలల కిందటే రిజర్వేషన్లు చేయించుకున్నవారికి మాత్రమే బెర్త్ లభిస్తోంది.వెయిటింగ్ లిస్టు అధికంగా ఉండడంతో సీటు దొరకుతుందన్న నమ్మకం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి రైల్వేశాఖ అధికారులు ఆయా రూట్లలో అదనపు రైళ్లను నడిపి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

– షోదదాసి శ్యామూల్‌రాజ్, కడప

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ప్రత్యేక రైళ్లు నడపకపోవడంతో రద్దీ పెరిగింది. ప్రత్యేక రైళ్లు నడిపి ఉంటే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేవి. ఈ విషయమై రైల్వేశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– వైవీ డేవిడ్, డీఆర్ యూసీసీ మెంబర్, గుంతకల్లు డివిజన్

అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుద్దాం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుద్దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సామాజిక సమతా సంకల్పంలో భాగంగా అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం (జన్ బాగీదరి) కార్యక్రమాన్ని, ఛాయా చిత్ర ప్రదర్శనను నిర్వహించినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళీ, సమాచారశాఖ డీఐపీఆర్‌ఓ భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్ శివశంకర్, సి అంజనప్ప, రమణ పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు కృషి: జేసీ

రాయచోటి టౌన్: జిల్లాలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. వివిధ అంశాలపై గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జేసీతో పాటు డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు. వీసీ అనంతరం జేసీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించాలన్నారు.

హార్సిలీహిల్స్‌పై ప్రత్యేక దృష్టి

- స్టార్ హోటల్ స్థాయిలో అతిథి గృహాలు
- పర్యాటకశాఖ ఎండీ కె.కన్నబాబు

సాక్షి ఎఫెక్ట్..



కన్నబాబు (ఫైల్)

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ నుంచి టూరిజానికి వస్తున్న ఆదాయం తగ్గిపోతున్న కారణాలను విశ్లేషించి ప్రత్యేక దృష్టి సారిస్తామని పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు అన్నారు. గురువారం 'ఆదాయానికి ప్రైవేటు'శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు అతిథిగృహాలకు సంబంధించిన విషయాలు తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. రెవెన్యూ అతిథిగృహం పర్యాటకశాఖ లీజు ప్రాతిపదికన తీసుకునేలా ప్రతిపాదన ఉందని చెప్పారు. ఈ విషయమై సీఎంఓ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అవసరమైతే అన్నమయ్యజిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. హార్సిలీహిల్స్‌పై టూరిజం ఆదాయం పెంచుకునేందుకు ఇప్పుడున్న అతిథిగృహాలను స్టార్ హోటల్ స్థాయిలో ఆధునికీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు, వసతులను కల్పిస్తామన్నారు. పర్యాటకశాఖకు బ్యాంకు రుణం మంజూరైందని ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. యూనిట్ నిర్వహణలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిచేసుకుని ఆదాయం పెంచుకుంటామని తెలిపారు. హార్సిలీహిల్స్‌ను రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానంలో నిలిపేలా కృషి చేస్తామన్నారు. తంబళ్లపల్లె సమీపంలోని పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై రూ.8 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

చిరు వ్యాపారులకు వరం 'జగనన్న తోడు'

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్



మెగాచెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తదితరులు

రాయచోటి: 'జగనన్న తోడు'చిరు వ్యాపారులకు వరం లాంటిదని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం 'జగనన్న తోడు'8వ విడతలో భాగంగా వడ్డీ లేని రుణలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న తోడు పథకం పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు రూ.10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో మహిళల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వం పది కాలాల పాటు ఉండేటట్లు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 8వ విడతలో జిల్లాలో మొత్తం 13,269 మందికి రూ.1404.00 లక్షలు వారి ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. జిల్లాలో జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన 17,698 మందికి రూ.42.43 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్న తోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథులందరూ కలిసి లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేశారు.

చకచకా పనులు

- జిల్లాలో జోరుగా పక్కా గృహాల నిర్మాణం
- సౌకర్యాలకు రూ.22 కోట్ల వ్యయం
- నిర్మాణాల్లో రాష్ట్రంలో రాయచోటి, మదనపల్లె టాప్
- నాలుగో స్థానంలో జిల్లా
- ఇళ్ల బిల్లులు రూ.743 కోట్ల చెల్లింపు



చిట్వేలి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట: పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణాలు వేగం అందుకున్నాయి. లేఔట్లలో కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి పేదలకు మెరుగైన సౌకర్యాలు, వసతులను ప్రభుత్వం కల్పించింది. దీంతో పనులు చకచక సాగిపోతున్నాయి. నిర్మాణాల్లో జిల్లాకు నాలుగో స్థానం దక్కగా, 175 నియోజకవర్గాల్లో రాయచోటి 3, మదనపల్లె 4వ స్థానంలో నిలిచాయి. జిల్లాకు మంజూరుచేసిన గృహాల్లో 30,138 గురువారం నాటికి పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి

రూ.743 కోట్ల ఖర్చు

జిల్లాకు 76,400 పక్కా గృహాలు కేటాయించగా అందులో 1,336 ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన నిర్మాణాలు సాగుతున్నాయి. మంజూరైన గృహాలను పేదలు నిర్మించుకునేలా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలను ఉచితంగా అందిస్తోంది. మొత్తం గృహాల నిర్మాణం కోసం రూ.1,433 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో గురువారం నాటికి రూ.743 కోట్లను లబ్ధిదారులకు బిల్లుల రూపంలో చెల్లించారు. జిల్లాలో వేసిన 513 లేఔట్లలో పేదల ఇంటి పనుల కోసం ప్రభుత్వం రూ.22 కోట్లు ఖర్చు చేసి నీటి ఇబ్బందులను తొలగించింది. నిర్మాణ పనులకు అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. పైప్‌లైన్లు, రోడ్లు, భూమి చదును పనులు చేయించింది.

- ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాలోని రాయచోటి, మదనపల్లె ముందు వరసలో ఉన్నాయి. రాయచోటి నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలకు రూ.198 కోట్లు, మదనపల్లెలో రూ.169 కోట్లు ఖర్చు చేశారు. దీంతో ఈ నియోజకవర్గాలు రాష్ట్రంలో 3, 4వ స్థానాల్లో నిలిచాయి. మిగతా నియోజకవర్గాల్లోనూ పనులు వేగంగానే సాగుతున్నాయి.

పూర్తయిన ఇళ్లు

కోడూరు	2,582
మదనపల్లె	6,992
పీలేరు	5,551
రాజంపేట	3,471
రాయచోటి	6,759
తంబళ్లపల్లె	4,783

వివిధ దశల్లో నిర్మాణాలు

బీబీఎల్	11,719
బీఎల్	21,273
ఆర్ఎల్	6,919
ఆర్‌సీ	5,015
పూర్తి	30,138



కాలనీల్లో వసతులకు చేసిన ఖర్చు

మొత్తం లేఔట్లు	513
నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)	రూ.9.44 కోట్లు
నీటి సరఫరా(పీహెచ్)	రూ.5.95కోట్లు
అప్రోచ్‌రోడ్లు	రూ.11.49 లక్షలు
భూ సేకరణ	రూ.3.55 కోట్లు
భూ చదునుకు	రూ.2.36 కోట్లు
ఇతరా పనులకు	రూ.25 లక్షలు

సకాలంలో బిల్లులు



పక్కా గృహం నిర్మాణం చేపట్టగా ప్రభుత్వం బిల్లుల చెల్లింపు పక్కాగా ఉంది. నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. సొంతిల్లు లేని తనకు ఇంటిని మంజూరు చేసి రూ.1.80 లక్షలు ఇచ్చి తిరిగి చెల్లించే అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. మాలాంటి పేదలకు ఇది ఎంతో ఊరట.

-సి.ఫైరోజీ, పెద్దమండ్యం

సొంతిల్లు ఇచ్చారు



15 ఏళ్లు అద్దె ఇంటిలో నివాసం ఉన్నాం. వైఎస్.జగన్ ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేసింది. ఈ స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్నా. పనులు పూర్తవుతున్నాయి. త్వరలోనే సొంతింటిలో గృహప్రవేశం చేస్తాం.

-ఎ.అనూరాధ, బ్రాహ్మణ ఒడ్డుపల్లె, కురబలకోట

పనులు వేగంగా సాగుతున్నాయి

గృహనిర్మాణాల్లో జిల్లా మొదటిస్థానానికి తేవడానికి కలెక్టర్, గృహనిర్మాణశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి లబ్దిదారులకు పూర్తి సహకారం లభిస్తుండటంతో పనులు వేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ సమీక్షలు, సమావేశాలతో పనుల్లో పురోగతి కోసం చర్యలు తీసుకుంటున్నారు.

-శివయ్య, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి

సౌత్ కొరియా టీమ్ కళాశాల సందర్శన



కొరియా టీమ్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలను సౌత్ కొరియా టీమ్ సభ్యులు సందర్శించారు. గురువారం అన్నమయ్య జిల్లా, రాయచోటిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ఇన్వెంటర్‌ను గుడ్ నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సౌత్ కొరియా టీమ్ సభ్యులు హన్, జమ్మిలియా, సందీప్ గుప్తలు పరిశీలించారు.వీరికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏ విధంగా పనిచేస్తుంది, వాటి ద్వారా ఎలాంటి కార్యక్రమాలు జిల్లాలో జరుగుతున్నాయనే విషయాల గురించి వివరించారు. అనంతరం సౌత్ కొరియా టీమ్ సభ్యులు ఇక్కడ శిక్షణ పొందుతున్న వారికి గుడ్ నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ తరపున ఉపాధి అవకాశాల్లో సాయం చేస్తామని తెలిపారు. గుడ్ నైబర్స్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కడప స్పోర్ట్స్: రాజంపేట పట్టణంలో ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం హ్యాండ్‌బాల్ పోటీలు(లీగ్ కమ్ నాకౌట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ పసుపులేటి ప్రదీప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి పవన్‌కుమార్ తెలిపారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించే ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచే క్రీడాకారులను 27 నుంచి 31వ తేదీ వరకు బీహార్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్టు



సారా విక్రేత అరెస్టు చూపుతున్న ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని రాచవేటివారిపల్లె దిగువమాచిరెడ్డిగారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. సారా విక్రయిస్తున్న స్థానికుడైన కరమల శ్రీరామ ఆచారిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానా

నిమ్మనపల్లె : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి గురువారం మదనపల్లె సెకండ్‌క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ రూ.17వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఐదురోజుల క్రితం నిమ్మనపల్లె–దిగువపల్లె మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన మోహన్‌సింగ్ కుమారుడు రావల్ మంజు సింగ్(39) మద్యం సేవించి రోడ్డుపై వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని తెలిపారు. అతనిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కేసు విచారించిన సెకండ్ క్లాస్ అడిషనల్ మేజిస్ట్రేట్ నిందితుడు మంజుసింగ్‌కు రూ.17వేలు జరిమానా చెల్లించాలని, చెల్లించని పక్షంలో మూడునెలల సాధారణ జైలుశిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దు

కడప కార్పొరేషన్ : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాయల్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఆందోళన అవసరమేనని, ప్రభుత్వ పెద్దలను కించపరుస్తూ, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సమ్మెలోకి రాజకీయాలు చొప్పించి లబ్ధిదారులకు నష్టం కలిగించడం సరి కాదన్నారు. 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవని, గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బండి మరియలు,శారద పాల్గొన్నారు.

కారు విడిభాగాలు చోరీ చేసే దొంగ అరెస్టు

- రూ.20లక్షలకు పైగా విలువైన నాజిల్స్, ఫ్యూయల్ పంప్స్, కారు స్వాధీనం
- నిందితుడు పెద్దమండ్యం వాసి
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కేశప్ప



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ కేశప్ప, పోలీస్ సిబ్బంది



నిందితుడి వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్ల విడిభాగాలు

మదనపల్లె : కారు మెకానిక్ షెడ్‌లో పనిచేస్తూ కారులోని విలువైన విడిభాగాలను చోరీ చేసి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో అమ్ముకుంటూ విలాసంగా జీవిస్తున్న దొంగను ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కేశప్ప వివరాలు వెల్లడించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామంలోని బండమీదవీధికి చెందిన చాంద్‌బాషా కుమారుడు హర్షద్(19) మెకానిక్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో కారులోని విడిభాగాలైన నాజిల్స్, డీజిల్ పంప్స్, ఇంజక్టర్లు విలువైనవిగా గుర్తించాడు. ఈ స్పేర్‌పార్ట్స్ బహిరంగ మార్కెట్లో అధిక ధరకు అమ్ముడవుతాయన్న విషయం తెలుసుకుని, వాటిని చోరీచేసి విక్రయించి పెద్ద మొత్తంలో ఆదాయం గడించేవాడు. ఈ క్రమంలోఏడాది కాలంగా అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె కేంద్రంగా వివిధ ప్రాంతాల్లోని కార్లలో విలువైన విడిభాగాలను చోరీచేశాడు. దీనికి సంబంధించి ఇదివరకే రాయచోటిలో ఇతనిపై నాలుగుకేసులు నమోదై ఉన్నాయి. గురువారం కురబలకోట మండలం అంగళ్లులో తనిఖీలు నిర్వహిస్తుండగా, నిందితుడైన హర్షద్ ఏపీ–31 బీహెచ్–3523 టాటా ఇండిగో కారులో విడిభాగాలను బెంగళూరుకు తరలించేందుకు అదే మార్గంలో వచ్చాడు. పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా బండారం బయటపడింది. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 12 కార్లలో దొంగిలించిన 12 డీజిల్ పంపులు, 48 ఇంజక్టర్లు, కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. విడి భాగాల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.18లక్షలు ఉంటుందని, సీజ్‌చేసిన కారు విలువ రూ.2లక్షలుగా లెక్కించి నిందితుని వద్ద నుంచి రూ.20లక్షల విలువ చేసే విడిభాగాలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని, అతడిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ శివాంజనేయులు, ఎస్ఐ ముబీన్‌తాజ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ ఎన్.శేఖర్, వన్‌టౌన్ సీఐ వలీబాషు, ముదివేడు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



జగనన్న విద్యా దీవెనతో చదువులకు భరోసా



నా కుమార్తె కటికపల్లి సంధ్య పేరిట విద్యా దీవెన నిధులు రూ.35 వేలు, వసతి దీవెన ద్వారా రూ.10 వేలు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యాయి. నా పేరిట కూడా రైతు భరోసా కింద ఏటా రూ.12,500 బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. గత టీడీపీ పాలనలో ఏదైనా సంక్షేమ పథకం మంజూరు కావాలంటే సిఫారసు ఉంటేనే ప్రయోజనం చేకూరేది. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు. ఎలాంటి సిఫారసు అవసరం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరింది.

– కటికపల్లి శివారెడ్డి, అంకిరెడ్డిపల్లి, పెద్దతిప్పసముద్రం మండలం.

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించింది. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు నాకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండా సర్టిఫికెట్లు రావడం ఆనందంగా ఉంది.

– మందపల్లి రామయ్య, గాంధీవీధి, సిద్దవటం

అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

జిల్లా మీడియా జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జిల్లా మీడియా హౌసింగ్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జిల్లాలో అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇళ్లస్థలాలను మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాలులో ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న ఇళ్ల స్థలాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా జర్నలిస్టు హౌసింగ్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జీఓ నంబరు 535లో ఉన్న అన్ని నిబంధల మేరకు జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వులలో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేసిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. 5 సంవత్సరాల అక్రిడేషన్ అనుభవం కల్గిన వారికి సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ వారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది జాబితా మేరకు ఇంటిస్థలం ఇస్తామన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో జనవరి 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లతో సహా దరఖాస్తును జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ, రాయచోటి కార్యాలయంలో వెంటనే అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయా నియోజకవర్గాలలో సరైన స్థలం గుర్తించాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళీ, సమాచార శాఖ డీఐపీఆర్‌ఓ భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, జిల్లా స్థాయి మీడియా జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సభ్యులు బీవీ నాగిరెడ్డి, బి.సాయిప్రతాప్ రెడ్డి, పి.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా చామంతి సాగు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి



చామంతి తోటలో రైతు కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం) : చామంతి సాగు ఆశాజనకంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఒంటిమిట్ట మండలం చెంచుగారిపల్లిలో పి.శివరామిరెడ్డి సాగు చేసిన చామంతి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు చామంతి తోటలో అధిక దిగుబడులను సాధించామని చెప్పారన్నారు. అనంతరం టి.గురవయ్య అనే రైతు సాగుచేసిన 10 ఎకరాల దోస పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల ఉద్యాన అధికారి పి. సింధూరి, వ్యవసాయాధికారి జి. కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి వై. ప్రభాకర్‌రెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకురాలు వి. ప్రియదర్శిని, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు పథకాలు అందాలి

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ప్రతి పథకం అర్హులైన ప్రతి రైతుకు అందేలా చొరవ చూపాలని ఉద్యాన అధికారులను రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీలో ఉద్యాన తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరవేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యానశాఖ ద్వారా ప్లాస్టిక్ మల్చింగ్ సబ్సిడీ పొందిన రైతులను పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా అమలయ్యే ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పంట నమోదు చేసుకోవడంలో ఉద్యాన అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ సలహా కమిటి సభ్యులు నాగేశ్వరరాజు, ఉద్యాన విస్తరణ అధికారి పూర్ణచంద్ర, సహాయకుడు చెంగల్‌రాయుడు, రైతులు చెంగల్‌రాజు, మురళీ, మృగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం



గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఇస్మాయిల్

మదనపల్లె : మానసిక పరిస్థితి సరిగా లేక ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కురబలకోట బీసీ కాలనీకి చెందిన మగ్బూల్ బాషా కుమారుడు ఎస్.ఇస్మాయిల్(45) ట్రాక్టర్ కూలీగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య ఆయేషా, ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొద్దిరోజులుగా మానసికంగా కుంగుబాటుకు లోనుకావడంతో గురువారం స్వగ్రామం ఉప్పులోరిపల్లెలో ఉన్న తల్లి మెహరూన్‌బీ వద్దకు వెళ్లాడు. అక్కడే ఇంట్లోని కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

కుటుంబ సమస్యలతో మరొకరు..

పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన వెంకటరమణ కుమారుడు రవి(40) కుటుంబ సమస్యలతో బుధవారం రాత్రి సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవితో చర్చిస్తున్న మలేరియా అధికారి

మదనపల్లె : వైద్య ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డెంగీ పరీక్షలు చేసే వెసులుబాటు ఉందని, ఈ పరీక్షలపై సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. గురువారం ఆయన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని వ్యాధి నిర్ధారణ కేంద్రాలను పరిశీలించారు. ల్యాబ్‌లో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవితో సమావేశమై డెంగీ పరీక్షలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక జిల్లా ఆస్పత్రిలో డెంగీవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే వెసులుబాటు ఉందన్నారు. గత ఏడాది జిల్లాలో 151 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. మదనపల్లె డివిజన్‌లో అత్యధికంగా 85 డెంగీ పాజిటివ్ కేసులు వచ్చాయని, అయితే వైద్యసిబ్బంది సకాలంలో స్పందించి రెఫరల్ ఆస్పత్రులకు పంపడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతుండటంతో డెంగీ కేసులు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. ప్రజలు తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఖలీల్, బయోమెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ఉమాపతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కారు సహా రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, దుంగలతో అటవీ అధికారులు

పీలేరు : కారుతోపాటు రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ సుబ్బారెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సుండుపల్లె వైపు నుంచి వేగంగా వెళుతున్న వాహనాన్ని సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగం పెంచి శివరామపురం, రేగళ్ల మీదుగా కందూరు వైపు వెళుతుండగా అటవీ సిబ్బంది తమ వాహనంలో వెంబడించారు. కందూరు వద్ద రోడ్డు పక్కన కారును ఆపి డ్రైవర్ చీకటిలో పరారయ్యాడు. వాహనాన్ని పరిశీలించగా 5 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌ఓ వెంకటరమణ, అటవీసిబ్బంది జె.ప్రతాప్, ప్రభుతేజ, చరణ్, సుబ్రమణ్యం, మల్లికార్జున పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కారు దగ్ధం



కారులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

మదనపల్లె : అగ్నిప్రమాదంలో కారు దగ్ధమైన ఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కావేరి హాస్పిటల్ పక్కన శేషప్ప తోటలో నివాసం ఉంటున్న ప్రసాద్ తన ఇంటిముందు మారుతి సుజుకి ఆల్టో కారును పార్క్‌చేసి ఉంచాడు. ఉదయం 9.45 గంటల సమయంలో ఉన్నట్లుండి కారులో మంటలు చెలరేగి, అగ్నిప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులకు తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారి శివప్ప సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.20వేల నష్టం వాటిల్లగా, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో రూ.2లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్లు యజమాని ప్రసాద్ తెలిపారు. అజాగ్రత్తగా పొగతాగడం వల్లనే అగ్నిప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ టీవీ ఇన్‌స్టాలర్, సూర్యమిత్ర, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్ ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, లైట్ మోటారు వెహికల్ డ్రైవర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90630 82227 నంబరులో సంప్రదించాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- రూ.1.50 లక్షల మద్యం, కారు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు, మరో ముగ్గురి పరార్



పట్టుబడిన మద్యం, కారు, నిందితులతో పోలీసులు

బి.కొత్తకోట : కర్ణాటక నుంచి అక్రమంగా కారులో మద్యం తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి కారును వెంబడించి పట్టుకున్న ఘటన మండలంలోని పప్పిరెడ్డిగారిపల్లె వద్ద జరిగింది. ఈ దాడుల్లో ముగ్గురు పట్టుబడగా మరో ముగ్గురు పరారయ్యారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ కథనం మేరకు వివరాలు. మండలంలోని బయ్యప్పగారిపల్లె, నాయనబావి, గట్టు గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో వెళ్లి కర్ణాటకలో మద్యం కొనుగోలు చేశారు. మద్యం తీసుకుని మొటుకుపల్లె గ్రామం మీదుగా నాయనబావి నుంచి పప్పిరెడ్డిగారిపల్లె వెళ్తుండగా సమాచారం అందడంతో నాయనబావి నుంచి ఎస్ఈబీ పోలీసులు, స్థానిక పోలీసులు కలిసి కారును వెంబడించారు. పప్పిరెడ్డిగారిపల్లె వద్ద కారును అదుపులోకి తీసుకుని పరిశీలించగా రూ.1.50 లక్షల విలువైన 3,840 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యం (345.60 లీటర్లు) గుర్తించారు. ఈ మద్యంతోపాటు ఇన్నోవా కారు, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పెద్దతిప్పసముద్రానికి చెందిన పి.జగదీష్ (24), గట్టుకు చెందిన బెత్తిరిపల్లె బి.రెడ్డెప్ప రెడ్డి (40), ఎర్రమ్మగారిపల్లె రెడ్డి నరసింహులు (40)లను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో రెడ్డివారిపల్లెకు చెందిన అరవింద్‌రెడ్డి, కనికలతోపుకు చెందిన బాబి, కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన శంకరమ్మ పరారైనట్లు తెలిపారు.

మరో కేసులో..

మండలంలోని బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ మారుతిరెడ్డి తెలిపారు. బి.కొత్తకోటకు చెందిన గంగాధర్ (35), రమేష్ (36)లు ఒక బాక్సు మద్యం తీసుకుని వస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరిచామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చీకలబైలు రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తుండగా, నిమ్మనపల్లెకు చెందిన రతన్‌సింగ్ కుమారుడు ప్రవీణ్‌సింగ్(32) కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి రూ.1,500 విలువచేసే 4బీర్లు, 4 వైన్‌బాటిల్స్, 2 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

గుర్రంకొండలో పిచ్చికుక్క వీరంగం

ముగ్గురికి గాయాలు




చిన్నారి రెహాన్‌కు తలపై తీవ్ర గాయాలైన దృశ్యం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. కనిపించిన వారిని ఇష్టానుసారం కరవడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఇరవైరోజుల వ్యవధిలోనే రెండవ సారి పిచ్చికుక్క దాడి చేయడంతో జనం బెంబేలెత్తిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక తాలీం వీధిలో ఇళ్ల ముందు ఆడుకొంటున్న చిన్నారులపై, స్థానికులపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో జనం భయపడి ఇళ్లలోకి పరుగులు తీశారు. పలువురు పిచ్చికుక్కను కొట్టేందుకు వెంబడించారు. అది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలోకి చొరబడి ఇష్టానుసారం కనిపించిన వారిపై దాడి చేస్తూ వెళ్లింది. పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన రెహాన్(04),మున్నా(06)లకు తలపై గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. మరికొందరిని కాళ్లు, చేతులపై కూడా కరిచింది. వీరితో పాటు అదే వీధి చివరిలో గొర్రెలు మేపుకొంటున్న మరో వ్యక్తిపై దాడి చేసింది. గాయపడిన వారిలో కొంత మందిని బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మరికొందరు తిరుపతిలోని ఆస్పత్రులకు తరలివెళ్లారు. 20 రోజుల వ్యవధిలో గుర్రంకొండ పట్టణంలో రెండవ సారి పిచ్చికుక్క దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీటీసీ మురళి పేర్కొన్నారు. గురువారం ఊటుకూరులోని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో కడప, ప్రొద్దుటూరు ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు ప్రయాణికులను తరలించేటప్పుడు అధిక చార్జీలను వసూలు చేయరాదన్నారు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే బస్సులను సీజ్ చేస్తామన్నారు. ఇందుకోసం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎంవీఐ విజయభాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న, ప్రణీత తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ సందర్శించారు.

ఆటలతో మానసిక వికాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : ఆటలు మానసిక వికాసానికి, శరీరం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎంతో దోహదం చేస్తాయని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం సహకార ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ జోన్ పరిధిలోని డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు బ్యాంకు ఆవరణంలో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సీఈఓతో పాటు ఓఎస్‌డీ గుర్రప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి సహకరిస్తాయన్నారు. మొదటి రోజు క్రికెట్ పోటీలను రిమ్స్ వద్ద ఉన్న వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. కడప, కర్నూలు జట్టు, అనంతపురం, చిత్తూరు జట్టు తలపడ్డాయి. ఇందులో కడప జట్టుపై కర్నూలు, అనంతపురం జట్టుపై చిత్తూరు విజయం సాధించాయి.